# పురుషోత్తంకు జోహార్లు

# సర్కారీ హంతకముఠాలను వ్యతిరేకించండి



పౌరహక్కుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పురుషోత్తం దారుణహత్య సాధారణ పౌరులను సైతం కుదిపివేసింది.

పోలీసుల అండదండలు స్పష్టంగా ఉన్న హంతకులు పట్టపగలు రాష్ట్ర రాజధానిలో రద్దీగా ఉన్న వీధిలో ఒక ఉద్యమకారుడిని తల నరికి చంపి వెళ్లిపోవడం అందరినీ కదిలించింది. మన రాష్ట్రంలో ప్రాణాలు ఎంత అభద్రంగా ఉన్నాయో అని ఆశ్చర్యం, ఆందోళన కలిగించింది.

పోలీసులు అమాయకత్వం నటిస్తూ రెండు మూడు రోజుల వ్యవధిలోనే పురుషోత్తం హంతకులను 'పట్టుకుని' ప్రెస్‌కాన్ఫరెన్స్ పెట్టించారుగానీ టీవీలోనూ పత్రికలు ప్రచురించిన ఫోటోలలోనూ వారి ముఖాలను చూసిన వారందరికీ అప్పటి వరకు కేవలం అనుమానంగా ఉన్నది రుజువయినట్టు అనిపించింది. ఆ ప్రెస్‌కాన్ఫరెన్స్ ఒక డ్రామా అని ఎవరూ చెప్పకుండానే అర్థం అయింది. ఆ హంతకులు చేసింది కోర్టులో రుజువయితే ఉరిశిక్ష సహితం పడగల నేరం. అయినప్పటికీ వారు అంత కులాసాగా 'పురుషోత్తంను మేమే హత్య చేసాము' అని ప్రకటించిన వైనాన్ని చూసిన వారికి ఆ నేరం కోర్టులో రుజువయ్యే ప్రసక్తి లేదని స్పష్టంగానే అర్థమయింది. పురుషోత్తం హత్య గురించి ఆందోళన పెద్ద ఎత్తున జరిగేసరికి పోలీసులు తమ జేబులో ఉన్న హంతకులను బయటికి తీసి పత్రికల వారికి చూపించి జైలుకు పంపించారు. చార్జిషీటు 90 రోజుల లోపల పెట్టకపోవడం ద్వారాగానీ ఈ లోపలే కోర్టులో ప్రభుత్వ వకీలు 'అభ్యంతరం లేదు' అని చెప్పడం ద్వారాగానీ వారికి త్వరలోనే బెయిలు వస్తుంది. వారు తిరిగి పోలీసుల జేబులోకే పోతారు.

దీనికి రుజువేమిటంటారా? మాకు ఏ పాపం తెలియదని రాష్ట్ర డిజిపి ప్రకటించలేదా అంటారా? నేరాల బాటపట్టి పురుషోత్తంను హత్య చేసిన 'మాజీ'ల ఆటకట్టిస్తామని ఆయన హామీ ఇవ్వలేదా అంటారా?

ప్రకటనలిచ్చారు, హామీలిచ్చారుగానీ ఇంకొన్ని విషయాలు తెలిస్తే వాటిలోని నిజాయితీ ఎంత అని మీరే అంచనా వేసుకోవచ్చు. డిజిపి ఈ ప్రకటనలిచ్చిన తరువాత ఆ హంతకులను రంగారెడ్డి జిల్లా సెషన్స్ కోర్టులో ప్రవేశపెట్టినప్పుడు వారికి పెద్ద గుంపొకటి నీరాజనం పట్టింది. వారంతా పీపుల్స్‌వార్ వల్ల భయం ఉన్న 'మాజీ'లేనని పోలీసులు పత్రికలలో రాయించారుగానీ అందులో చాలామంది మఫ్టీ పోలీసులున్నారని ఆ కోర్టులో ప్రాక్టీస్ చేసే లాయర్లు గమనించారు. వారిద్దరినీ వీరు నినాదాలతో ఊరేగింపుగా తీసుకుపోయారు. తమను సత్కరించిన ఈ గుంపునుద్దేశ్యించి ఆ హంతకులు ప్రసంగిస్తూ రెండు విషయాలు చెప్పారు. ఒకటి, త్వరలోనే బయటికొచ్చేస్తామని. రెండు, ఇంకా ఒకరిద్దరిని చంపేది ఉందని.

ఈ ప్రకటనలు వారు డిజిపిదొరగారి పోలీసుల కస్టడీలో ఉండి, వారి పోలీసులతో సహా ఇతర అభిమానులను ఉద్దేశ్యించి ప్రసంగిస్తూ చేశారు.

వీరి గతచరిత్ర కూడా డిజిపి దొరగారి ప్రకటన పట్ల సందేహం రేకెత్తించే చరిత్రే. వీరు ఒకప్పుడు పీపుల్స్‌వార్‌లో పని చేసి బయటికొచ్చి దాదాగిరీ చేసి బతుకుతున్న క్రిమినల్స్. కనీసం నాలుగు జిల్లాల్లోనూ- నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ- రాష్ట్ర రాజధానిలోనూ వీరి నేరాలు సాగుతున్నాయి. వీరి దగ్గర ఆయుధాలుంటాయి. వాటిని చూపించి బహిరంగంగానే వ్యాపారస్తులను, కాంట్రాక్టర్లను బెదిరించి డబ్బులు వసూలు చేసుకొని బతుకుతుంటారు. భూమి తగాదాలలోనూ వ్యాపార ఘర్షణలలోనూ తలదూర్చి బలప్రయోగంతో పరిష్కారాలు చేస్తుంటారు. పీపుల్స్‌వార్‌కు సహాయపడుతున్నారని తాము భావించే వ్యక్తులకూ, ఉద్యమకారులకూ ఫోన్లు చేసి చంపుతామని బెదిరిస్తుంటారు.

వీరు పోలీసుల కనుసన్నలలో బతుకుతుంటారని ఆ జిల్లాల ప్రజలకు తెలుసును. కత్తుల సమ్మయ్య, జడల నాగరాజు కొంతకాలం కరీంనగర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోనే నివసించే వారు. ప్రస్తుతం సమ్మయ్య హైదరాబాద్‌లో పోలీసుల పహారాలో బతుకుతున్నాడు. పోలీసుల సహాయంతో అతను సాయుధుడిగా ప్రెస్‌కాన్ఫరెన్స్ నిర్వహించి పీపుల్స్‌వార్‌ను అంతమొందిస్తానని ప్రకటించిన సంగతి రాష్ట్రప్రజలందరూ టీవీలో చూశారు.

బయ్యపు సమ్మిరెడ్డి గోదావరిఖనిలో సింగరేణి కాలరీస్ ప్రకటించిన కాంట్రాక్టులకు టెండర్లు వేయడానికి వచ్చిన వారిని బెదిరించి తరిమేసి తాను మద్దతు ఇచ్చిన కాంట్రాక్టరొక్కడే టెండర్ వేయగలిగేటట్టు చూసిన ఉదంతాలున్నాయి. అతనితోపాటు పురుషోత్తం

హంతకుడిగా టీవీలో కనిపించిన నయీముద్దీన్ బలవంతపు వసూళ్లు చేయడమేకాక, చాలా మంది ప్రజాతంత్ర ఉద్యమకారులకు బెదిరింపు ఫోన్‌కాల్స్ చేశాడు.

ఈ క్రిమినల్ 'మాజీ'లకు తోడు కొందరు వట్టి (అంటే 'మాజీ'లుకాని) ఇన్‌ఫార్మర్లు, కొందరు సస్పెండయిన పోలీస్ కానిస్టేబుళ్లు, కొందరు 'స్పెషల్' పోలీసులు ఉన్నారు. వీరంతా కలిసి 'కౌంటర్ ఇన్‌సర్జెంట్' (తిరుగుబాటు-వ్యతిరేక) ముఠాలుగా వ్యవహరిస్తున్నారు. క్రాంతిసేన, గ్రీన్‌టైగర్స్ అనే పేర్లతో వ్యవహరిస్తున్నారు. వీరి నాయకుడిగా తనను తాను పత్రికలకు పరిచయం చేసుకున్న హరిభూషణ్ అనే నామధేయం గల వ్యక్తి హక్కుల ఉద్యమకారులనూ ఇతర ప్రజాతంత్ర ఉద్యమకారులనూ పేరు పేరునా పేర్కొంటూ చంపుతామని వరంగల్ నుండి ప్రకటనలిస్తుంటాడు. నిజామాబాద్ జిల్లాలో పీపుల్స్‌వార్‌లో ముఖ్య బాధ్యతలు నిర్వర్తించి ఆయుధాలు, డబ్బులతో సహా వెళ్లిపోయిన హరిభూషణ్, సునీతలు కూడా ఈ ముఠాలో భాగమేనని పీపుల్స్‌వార్ ఇటీవల ప్రకటించిందిగానీ వారి చర్యలు ఇంకా బయటికి రాలేదు.

ఈ 'సర్కారీ' నేరస్తులను ఇంత వివరంగా పరిచయం చేయడానికొక కారణం ఉంది. పురుషోత్తం చాలా చురుకుగా పని చేసిన పౌరహక్కుల కార్యకర్త. ఒక దశాబ్దం పైగా పౌరహక్కుల ఉద్యమాన్ని తాను నమ్మిన నమూనాలో అభివృద్ధి చేయడానికి నిస్వార్థంగా, నిర్విరామంగా కృషి చేసిన వ్యక్తి. అతను నమ్మిన నమూనా పట్ల మానవహక్కులవేదికకు అభిప్రాయభేదమున్నప్పటికీ ఒక హక్కుల ఉద్యమకారునిగా అతని కృషి పట్ల మాకు గౌరవం ఉంది.

అటువంటి ఉద్యమకారుడు ఏ విధంగా చనిపోయినా అది బాధాకరమే. అతనిని ఎవరు, ఏ కారణంగా హత్యచేసినా అది ఖండించదగ్గ విషయమే. కానీ ఆ హంతకులు పోలీసుల కనుసన్నలలో బతికే సర్కారీ హంతకులయినప్పుడు అదింకకేవలం ఆ హతుడి సమస్యకాదు. అప్పుడు ప్రజాస్వామ్యానికి ఏ గతి పట్టిందని అందరూ ఆందోళన చెందవలసి ఉంటుంది. చట్టబద్ధపాలనను మన పాలకులు ఎంత దూరం దిగజార్చారని అందరూ ఆవేదన చెందవలసి ఉంటుంది. కేవలం పురుషోత్తంకో పౌరహక్కుల సంఘానికో హక్కుల ఉద్యమానికో కాక రాజకీయ స్వేచ్ఛనూ ప్రభుత్వంతో విభేదించే హక్కునూ కోరుకునే వారందరికీ ఇవి చాలా ప్రమాదకరమైన పరిణామం అని అందరమూ గుర్తించవలసి ఉంటుంది.

ఈ సర్కారీ హంతకుల దుష్ట వ్యవస్థ బాగా 'అభివృద్ధి' చెందిన కాశ్మీర్, అస్సాం వంటి రాష్ట్రాల నుండి దీని స్వరూప స్వభావాల గురించి కొంచెం తెలుసుకోవచ్చు. ఈ సర్కారీ హంతకులు భద్రతా సిబ్బందిని విడిచి దూరం పోరు. వీరెక్కడున్నా దగ్గరిలోనే ఏమీ జరగనట్టు భద్రతాసిబ్బంది సంచరిస్తుంటారు. వీరి నుండి ప్రజలను కాపాడడానికి కాదు. ప్రజల నుండి వీరిని కాపాడడానికి. వీరికి మిలిటెంట్ల నుండి ప్రమాదం ఉంది కాబట్టి వీరి వద్ద ఆయుధాలు ఉండనిస్తున్నామని భద్రతా దళాధిపతులూ పౌరప్రభుత్వమూ వివరిస్తాయి. ప్రమాదం ఉన్న సంగతి నిజమే కావచ్చు. తమ నుండి బయటికి పోయిన వారి పట్ల మిలిటెంట్ ఉద్యమాలు తరచుగా చాలా అసహనం, వ్యతిరేకత ప్రదర్శిస్తాయనేది తెలిసిన సంగతే. అటువంటి వారికి చట్టం పరిధిలో పాలనాయంత్రాంగం రక్షణ కల్పించడం అవసరమే. కానీ కాశ్మీరీ సర్కారీ మిలిటెంట్ల నుండి సమ్మిరెడ్డి, నయీముద్దీన్‌ల దాకా వీరెవ్వరి దగ్గరున్నవీ లైసెన్స్డ్ ఆయుధాలు కావు. ఆ ఆయుధాలను వీరు నేరాలు చేయడానికి వాడుకున్నా పోలీసులు వాటిని జప్తు చేసుకోరు. వారిపైన కేసు పెట్టరు. ఒక వేళ తప్పనిసరయి కేసు పెట్టినా ప్రాసిక్యూట్ చేయరు. నాలుగు రోజుల తరువాత వారు బెయిలుపైన బయటికొచ్చి యధాప్రకారం నేరాలు చేస్తూ బతుకుతారు.

వాళ్లకు రక్షణ కల్పించే పద్ధతి ఇది కాదు. నిజానికి పాలకుల ఉద్దేశ్యం వారికి రక్షణ కల్పించడం కాదు. వారి అభద్రతనూ నేరప్రవృత్తినీ పాలనాయంత్రాంగం ప్రయోజనాల కోసం చట్టవిరుద్ధంగా వాడుకోవడం.

ఈ సర్కారీ నేరస్తుల చేతిలో హక్కుల ఉద్యమకారులు ప్రాణాలు పోగొట్టుకోవడం కొత్త సంగతి కాదు. పంజాబులో జస్వంత్ సింగ్ కల్రా, కాశ్మీర్లో జలీల్ అంద్రబీ, అస్సాంలో పరాగ్‌కుమార్‌దాస్, నాగాలాండ్‌లో జడ్.వి.యాప్పీ మిలిటెంట్ల చేతిలో ప్రాణాలు కోల్పోయిన హక్కుల ఉద్యమకారులు. మన పురుషోత్తం కూడా ఇప్పుడు అటువంటి వాళ్ల చేతుల్లోనే హతుడయ్యాడు.

ఉద్యమాలలో బాధ్యతలు నిర్వర్తించిన వ్యక్తులు ఉద్యమద్వేషులుగానూ ప్రభుత్వం చెప్పు చేతలలో బతికే హంతకులుగానూ మారడానికి ఆ ఉద్యమాల బాధ్యత ఏమీ లేదా, వారిని ప్రశ్నించనక్కరలేదా అని అడిగేవారు ఉంటారు. మేము ఈ ప్రశ్నను దాటవేయదలచుకోలేదు. ఏదో డొంకతిరుగుడు జవాబు చెప్పదలుచుకోలేదు. వారి బాధ్యత సహితం ఉందనీ, వారిని ప్రశ్నించాలనీ ఒప్పుకుంటాం. ప్రజాస్వామ్య విధ్వంసకమైన పరిణామాలకు ఎవరు ఏ కోణం నుండి ఏ మేరకు బాధ్యులయినా వారిని ప్రశ్నించవలసిందే.

అయితే ఆ ప్రశ్న, దానికి వారిచ్చే జవాబు ఎట్లాగున్నా నేరస్తుల ముఠాలను చేరదీసి వారి నేరాలకు అభయం ఇచ్చి ఉద్యమాలపైన, తమ పాలనకు వ్యతిరేకమైన వారిపైన ప్రయోగించే ప్రభుత్వ వ్యూహాన్ని అత్యంత ప్రమాదకరమైన, అభ్యంతరకరమైన విషయంగా అందరమూ గుర్తించడం అవసరం. దానిని సాగనిస్తే పాలకులకు గులాంలైన వారికి తప్ప వేరెవ్వరికీ జీవితానికి భద్రత ఉండదు, రాజకీయ స్వేచ్ఛ ఉండదు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యమే ఉండదు.

హైదరాబాద్
16.12.2000

మానవహక్కుల వేదిక (HRF)